వేమన కాలనీ సెక్షన్‌ పరిధిలో విద్యుత్‌ సమస్యలు ఉంటే..

చందానగర్‌ : వేమనకాలనీ సబ్‌స్టేషన్‌ పరిధిలో విద్యుత్‌ సరఫరాలో అంతరాయం ఉంటే ఈ నెంబర్లను సంప్రదించవచ్చు అని ఏఈ శ్రీనివాసరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు.

- శ్రీనివాస్‌రెడ్డి ఏఈ : 8712472702
- ఫ్యూజ్‌ ఆఫ్‌ కాల్‌ : 8712472711
- లైన్‌ ఇన్‌స్పెక్టర్‌ మోహన్‌రావు : 8712487764 (కెపీఎస్‌ఆర్‌, పీజేఆర్‌, అన్నపూర్ణ ఎన్‌క్లేవ్‌, శ్రీరాం నగర్‌, వేముకుంట, జవహర్‌ కాలనీ)
- లైన్‌ ఇన్‌స్పెక్టర్‌ జీవన్‌ : 8712487754 (శంకర్‌నగర్‌, సురక్ష ఎన్‌క్లేవ్‌, సత్య ఎన్‌క్లేవ్‌, శుభోదయ కాలనీ, విద్యానగర్‌, రెడ్డి కాలనీ, రాజేంద్రరెడ్డి కాలనీ, పద్మజ కాలనీ, గౌతమీనగర్‌, దీప్తిశ్రీనగర్‌, శాంతినగర్‌)
- ఏఎల్‌ఎం రమేష్‌ : 9700905903 (పీజేఆర్‌ ఎన్‌క్లేవ్‌, కెపీఎస్‌ఆర్‌ ఎన్‌క్లేవ్‌ ఏరియాలు)
- ఏఎల్‌ఎం వెంకటేష్‌ : 9989185419 (శాంతినగర్‌, దీప్తిశ్రీనగర్‌)
- ఆర్టిజన్‌ రమేష్‌ : 9177772323 (సురక్ష ఎన్‌క్లేవ్‌, రాజేందర్‌రెడ్డి నగర్‌, విద్య నగర్‌, సత్య ఎన్‌క్లేవ్‌, గౌతమీనగర్‌)
- ఆర్టిజన్‌ కుమార్‌ : 9553614407 (ఫ్రెండ్స్‌ కాలనీ, శిల్పా ఎన్‌క్లేవ్‌)

బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా మహిపాల్‌రెడ్డి



శేరిలింగంపల్లి: బీజేపీ రంగారెడ్డి అర్బన్‌ జిల్లా ప్రధాన కార్యదర్శిగా శేరిలింగంపల్లి భెల్‌ ఎంఐజీ కాలనీకి చెందిన తోపుగొండ మహిపాల్‌ రెడ్డిని జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి నియమించారు. ఈ సందర్భంగా మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో బీజేపీ జెండాను ఎగురవేస్తామన్నారు. తన నియామకానికి సహకరించిన రాష్ట్ర, జిల్లా అధ్యక్షులు రాంచందర్‌రావు, శ్రీనివాస్‌రెడ్డి, నియోజకవర్గ ఇంచార్జ్‌ ఎం.రవికుమార్‌యాదవ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

భెల్‌ ఎంఐజీ కాలనీలో బోనాల వేడుకలు



పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే గాంధీ

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి భెల్‌ ఎంఐజీ కాలనీలో శ్రీ లలిత పోచమ్మ ఆలయంలో బోనాల వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షులు, మాజీ కౌన్సిలర్‌ జి.మోహన్‌గౌడ్‌ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి నిర్వహించిన బోనాలు, ఫలహారం బండి ఊరేగింపు కార్యక్రమంలో ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్‌ సింధు ఆదర్శ్‌రెడ్డిలు పాల్గొన్నారు. కార్యక్రమంలో నాయకులు మాజీ కౌన్సిలర్లు రవీందర్‌రావు, బాబ్జీ నాయకులు సత్యనారాయణరెడ్డి, ఆదర్శ్‌రెడ్డి, కొండల్‌రెడ్డి, ప్రీతమ్‌, సంపత్‌, రాకేష్‌రెడ్డి, పవన్‌ గౌడ్‌ తదితరులు పాల్గొన్నారు.

హవోర్త్‌ ఎక్స్‌పీరియన్స్‌ సెంటర్‌ ప్రారంభం



రాయదుర్గం: హైదరాబాద్‌ నాలెడ్జి సిటీలో అతిపెద్ద ఎక్స్‌పీరియన్స్‌ సెంటర్‌ను సోమవారం ప్రారంభించారు. హవోర్త్‌ ఇండియా పేరిట సరికొత్త, అత్యాధునిక ప్రీమియం ఎగ్జిక్యూటివ్‌ ఫర్నిచర్‌ షోరూమ్‌ను నగర వాసుల కోసం అందుబాటులోకి తీసుకొచ్చారు. హవోర్త్‌ ఇంటర్నేషనల్‌ అధ్యక్షుడు హెన్నింగ్‌ఫిఫ్జ్‌, హవోర్త్‌ ఏపీఏసీ సేల్స్‌ వైస్‌ ప్రెసిడెంట్‌, మేనేజింగ్‌ డైరెక్టర్‌ మనీష్‌ ఖండేల్వాల్‌ ప్రారంభించారు.

అన్నపూర్ణేశ్వరుడిగా గణనాథుడు

పటాన్‌చెరు టౌన్‌: పటాన్‌చెరు మండలం రుద్రారం గ్రామ పరిధిలోని గణేష్‌గడ్డ దేవస్థానంలో శ్రావణమాసం చివరి సోమవారంను పురస్కరించుకొని ఆలయంలో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు మాట్లాడుతూ.. శ్రావణమాసం చివరి సోమవారం నేపథ్యంలో అభిషేకం, ప్రత్యేక పూజలతో పాటు స్వామివారిని అన్నంతో అన్నపూర్ణేశ్వరుడిగా అలంకరించామన్నారు.

మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరు టౌన్‌: డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. ట్రాఫిక్‌ సీఐ లాలూనాయక్‌ తెలిపిన వివరాల ప్రకారం...ఆదివారం నిర్వహించిన డ్రైవ్‌లో 25 మందిని పట్టుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన వాహనదారులను సోమవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా 21 మందికి మందికి ఒక్కొక్కరికి రూ. వెయ్యి జరిమాన, మరో ఇద్దరి కి రూ. 1500 జరిమాన, మరో వ్యక్తి కి రూ.2 వేలు,మరో వ్యక్తికి రూ. 2500 జరిమాన విధించినట్లు ట్రాఫిక్‌ పోలీసులు పేర్కొన్నారు.

నిత్యం రద్దీనే... రోడ్డు విస్తరణేదీ?

లింగంపల్లి రైల్వేస్టేషన్‌ వద్ద తప్పని ఇబ్బందులు



లింగంపల్లి రైల్వే స్టేషన్‌ 6వ ప్లాట్‌ఫారం వైపు వాహనాల రద్దీ

శేరిలింగంపల్లి: నగర శివారులో అతిపెద్ద రైల్వేస్టేషన్లలో ఒకటిగా 'లింగంపల్లి' స్టేషన్‌కు పేరుంది. ఇక్కడి నుంచే దేశంలోని వివిధ ప్రాంతాలకు, నగరం, శివారు ప్రాంతాలకు రైళ్ల రాకపోకలు ఉంటాయి. రైల్వే శాఖకు అత్యధిక ఆదాయం సమకూర్చే స్టేషన్లలో ఇది కూడా ఒకటిగా గుర్తింపు పొందడమేకాకుండా అత్యధిక రైలు ప్రయాణికులు రాకపోకలు సాగించే స్టేషన్‌గా కూడా గుర్తింపు సాధించింది. ఇంతటి ప్రాధాన్యం కలిగిన రైల్వే స్టేషన్‌కు ప్రయాణికులు రావాలంటే రోడ్లు అధ్వానంగా మారడం, ఇరుకుగా ఉండటంతో ఇక్కట్లు పడుతున్నారు. రోజు రోజుకూ రైళ్ల సంఖ్య, రైలు ప్రయాణికుల సంఖ్య, స్టేషన్‌కు రాకపోకలు సాగించే వాహనాల సంఖ్య కూడా పెరుగుతూ పోతోంది. కానీ రోడ్డు విస్తరణ, మరమ్మతులు చేయడం లేదని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నిత్యం సమస్యలు ఇక్కడే...

- పటాన్‌చెరు, కూకట్‌పల్లి, మియాపూర్‌, హఫీజ్‌పేట్‌, చందానగర్‌ నుంచి నగరం, ఔటర్‌ రింగురోడ్డు, ఐటీ కారిడార్‌, ఫైనాన్షియల్‌ డిస్ట్రిక్ట్‌ ప్రాంతాలకు లింగంపల్లి ద్వారానే వెళ్లాలి. దీంతో నిత్యం ఉదయం నుంచి రాత్రి వరకు ట్రాఫిక్‌ రద్దీ ఉంటుంది.
- సాధారణ రైళ్ల రాకపోకలు సాగే లింగంపల్లి స్టేషన్‌ వైపు వెళ్లడానికి, ఎంఎంటీఎస్‌ రైళ్ల రాకపోకలు సాగించే స్టేషన్‌ వైపు వెళ్లాలంటే ఇబ్బందులు తప్పడం లేదు
- నిత్యం తెల్లవారుజాము నుంచి ఉదయం 8 గంటల వరకు, సాయంత్రం 4.30 నుంచి రాత్రి 9 గంటల వరకు ప్రయాణికులు, వాహనదారులు, పాదచారులు అవస్థలు పడుతున్నారు.
- లింగంపల్లి రైల్వే స్టేషన్‌కు ఉదయం దూర ప్రాంతాల రైళ్ల ద్వారా వచ్చిన ప్రయాణికులను తీసుకెళ్లేందుకు కుటుంబ సభ్యులు సొంత వాహనాల్లో రావడం రోడ్డుపైనే వాహనాలను నిలపడంతో సమస్య తీవ్రం అవుతోంది. స్కూల్‌ బస్సుల కూడా రాకపోకలు, ఆటోస్టాండ్‌ కూడా రోడ్డుపైనే ఉండటంతో మరిన్ని ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

సమస్య పరిష్కారానికి చొరవ ఇలా...

- లింగంపల్లి రైల్వే స్టేషన్‌లోని ప్లాట్‌ఫారం 6 వైపు ట్రాఫిక్‌ క్రమబద్ధీకరణకు ట్రాఫిక్‌ పోలీసులు చర్యలు తీసుకోవాలి. అందుకోసం రైల్వే అధికారులు పూర్తిగా వారికి సహకరించాలి
- ప్రయాణికుల కుటుంబసభ్యులు, స్నేహితులు తీసుకెళ్లేందుకు, స్టేషన్‌లో దించేందుకు పార్శిల్‌ సెంటర్‌ వైపు ఉన్న ఖాళీ స్థలంలో ప్రత్యేకంగా పార్కింగ్‌ చేసుకునేందుకు అవకాశం కల్పించాలి.
- ప్లాట్‌ఫారం 6 వైపు ఆటోస్టాండ్‌ను రోడ్డుపై కాకుండా రైల్వేస్టేషన్‌ ప్రాంగణంలో ఏర్పాటు చేయాలి.
- ప్లాట్‌ఫారం 6 వైపు ఉన్న రోడ్డు షోల్డర్స్‌ను అభివృద్ధి చేసి, మధ్య డివైడర్‌ను ఏర్పాటు చేయడం ద్వారా సమస్యను అరికట్టవచ్చు.
- ఆర్టీసీ రైల్వే స్టేషన్‌ నుంచి వివిధ ప్రాంతాలకు మినీ బస్సులను నడిపితే ప్రయాణికులకు ఎంతో మేలు చేకూరుతుంది.



లింగంపల్లి స్టేషన్‌ రోడ్డులో రోడ్డుపైనే ఆటోల పార్కింగ్‌

మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట

ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ



సాయినగర్‌ కాలనీలో సమస్యలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గాంధీ

మియాపూర్‌ : మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నామని ఎమ్మెల్యే గాంధీ అన్నారు. చందానగర్‌ డివిజన్‌ పరిధిలోని సాయినగర్‌ కాలనీలో కార్పొరేటర్‌ ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీలో సమస్యలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాలనీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కాలనీలో డ్రైనేజీ సమస్య పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో జలమండలి అధికారులు జీఎం శ్రీనివాస్‌రెడ్డి, డీజీఎం నారాయణ, మేనేజర్లు సునీత, శిరీష, వర్క్‌ ఇన్‌స్పెక్టర్‌ కిష్టప్ప, నాయకులు రఘునాథ్‌రెడ్డి, శ్రీనివాస్‌ యాదవ్‌ తదితరులు పాల్గొన్నారు.

24న సాగర్‌, ఎత్తిపోతల సందర్శనకు సూపర్‌ లగ్జరీ బస్‌

మియాపూర్‌ : నాగార్జునసాగర్‌, ఎత్తిపోతల సందర్శనకు ఒకరోజు టూర్‌ ప్యాకేజీతో సూపర్‌ లగ్జరీ బస్సు నడపనున్నట్టు మియాపూర్‌ డిపో మేనేజర్‌ మోహన్‌రావు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 24వ తేదీ ఉదయం 5 గంటలకు మియాపూర్‌ నుండి బయల్దేరి రాత్రి 8 గంటలకు మరలా మియాపూర్‌కు చేరుకుంటుందని తెలిపారు. ఆసక్తి గల ప్రయాణికులు 8500309052 నంబర్‌కు ఫోన్‌చేసి టికెట్లు బుక్‌ చేసుకోవాలని తెలిపారు. ఒక్కో టికెట్‌ ధర రూ.1200 ఉంటుందని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు ప్రైవేటు స్కూలు టీచర్లకు శిక్షణ

రాయదుర్గం: శేరిలింగంపల్లి మండల పరిధిలోని ప్రైవేట్‌ మేనేజ్‌మెంట్‌ బడ్జెట్‌ స్కూళ్ల టీచర్లకు ప్రత్యేక శిక్షణా కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహిస్తారు. ప్రైవేట్‌ బడ్జెట్‌ స్కూళ్లలో తెలుగు, ఇంగ్లిష్‌, హిందీ, గణితం, సామాన్యశాస్త్రం, సాంఘికశాస్త్రం సబ్జెక్టులు బోధించే టీచర్లకు ప్రత్యేకంగా ఒకరోజు శిక్షణా కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తూ జిల్లా విద్యాధికారి పి సుశీంద్రారావు ఉత్తర్వులు జారీ చేశారని ప్రైవేట్‌ మేనేజ్‌మెంట్‌ బడ్జెట్‌ స్కూళ్ల అసోసియేషన్‌ అధ్యక్షుడు ఎం నిజామ్‌అలీఖాన్‌ తెలిపారు. ఇంగ్లిష్‌, గణితం, సామాన్యశాస్త్రం టీచర్లకు రాయదుర్గంలోని నాగార్జున ఉన్నత పాఠశాలలో, తెలుగు, హిందీ, సాంఘికశాస్త్రం సబ్జెక్టులు బోధించే టీచర్లకు మియాపూర్‌లోని సెయింట్‌ రీటా ఉన్నత పాఠశాలలో శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. ఈ కార్యక్రమాలకు విద్యాశాఖ ఆర్‌జేడీ, జిల్లా విద్యాధికారి, మండల విద్యాధికారి పాల్గొని పరిశీలిస్తారు.

వరదనీటిలో గుల్‌మొహర్‌ పార్కు



పార్కులోని ఓపెన్‌జిమ్‌లో వరద నీరు



వరద నీటిలో మునిగిన వాకింగ్‌ ట్రాక్‌

10 రోజులుగా మూసివేత

శేరిలింగంపల్లి: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో ఇక్కట్లు పడుతున్నారు. గచ్చిబౌలి డివిజన్‌ గుల్‌మొహర్‌పార్కు కాలనీలోని జీహెచ్‌ఎంసీ పార్కులో భారీగా వరద నీరు నిలిచిపోవడంతో పార్కు మూసివేశారు. దీంతో నిత్యం వాకింగ్‌, వ్యాయామం చేసే వారు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయంలో అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకొని పార్కులోకి వరదనీరు రాకుండా అలాగే ప్రస్తుతం నిలిచిపోయిన నీటి తొలగింపునకు చర్యలు తీసుకోవాలని డిమాండ్‌ చేస్తున్నారు.వరుస వర్షాలతో వరదనీరు గుల్‌మొహర్‌పార్కులో నిలిచిపోయింది. దీంతో పార్కు గేటుకు తాళం వేశారు. గుల్‌మొహర్‌ పార్కులోకి ఆలిండ్‌ పరిశ్రమ నుంచి సీపేజ్‌తో వరద నీరు వస్తోంది. పరిశ్రమ ప్రహరీ దెబ్బతినడంతో సమస్య నెలకొంది. గతంలో పార్కు చుట్టూ కొన్ని ప్లాట్లు ఉండటంతో వరద నీరు వాటి ద్వారా రోడ్లపైకి వెళ్ళేది. ప్రస్తుతం బిల్డింగ్‌లు రావడంతో వరద నీరు పార్కులోనే నిలిచిపోతుంది. ఇప్పటికైనా సమస్య పరిష్కారానికి జీహెచ్‌ఎంసీ జోనల్‌ కమిషనర్‌ ప్రత్యేక దృష్టి సారించి వెంటనే చర్యలు తీసుకోవాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

పాపన్నగౌడ్‌ ఆశయసాధనకు కృషి చేయాలి



ఆల్విన్‌ ఎక్స్‌రోడ్డులో పాపన్నగౌడ్‌ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే గాంధీ

మియాపూర్‌ : సర్దార్‌ సర్వాయి పాపన్నగౌడ్‌ ఆశయ సాధనకు కృషి చేయాలని ఎమ్మెల్యే గాంధీ పేర్కొన్నారు పాపన్నగౌడ్‌ జయంతి సందర్భంగా డివిజన్‌ పరిధిలోని ఆల్విన్‌ ఎక్స్‌రోడ్డు వద్ద ఉన్న పాపన్నగౌడ్‌ విగ్రహానికి కార్పొరేటర్‌ ఉప్పలపాటి శ్రీకాంత్‌, శేరిలింగంపల్లి గౌడ సంఘం సభ్యులతో కలిసి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత పాపన్నగౌడ్‌ అడుగుజాడల్లో నడవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రఘునాథ్‌రెడ్డి, శేరిలింగంపల్లి గౌడ సంక్షేమ సంఘం అధ్యక్షులు లక్ష్మీనారాయణగౌడ్‌, ప్రధాన కార్యదర్శి కె. శ్రీనివాస్‌గౌడ్‌, యూత్‌ కమిటీ అధ్యక్షులు బాలింగ్‌ గౌతమ్‌ గౌడ్‌, నాయకులు కరుణాకర్‌ గౌడ్‌, ఓం ప్రకాష్‌ గౌడ్‌, సురేష్‌ గౌడ్‌ తదితరులు పాల్గొన్నారు.



చందానగర్‌ సర్కిల్‌ కార్యాలయంలో..

చందానగర్‌ సర్కిల్‌ కార్యాలయంలో...

చందానగర్‌ సర్కిల్‌ కార్యాలయంలో పాపన్నగౌడ్‌ జయంతి వేడుకలను నిర్వహించారు. జీహెచ్‌ఎంసీ సిబ్బంది, అధికారులు పాపన్నగౌడ్‌ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.

ఆలయాభివృద్ధికి సహకారం



పటాన్‌చెరు: నియోజకవర్గ పరిధిలో నూతన దేవాలయాల నిర్మాణాలకు, అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌ రెడ్డి అన్నారు. అమీన్‌పూర్‌ మున్సిపల్‌ పరిధిలోని రెండో వార్డులో గల రేణుక ఎల్లమ్మ తల్లి దేవాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఆయన్ని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మార్కెట్‌ కమిటీ మాజీ చైర్మన్‌ విజయ్‌కుమార్‌, మాజీ కౌన్సిలర్‌ కృష్ణ, ప్రమోద్‌రెడ్డి, గోపాల్‌, రుష్యంత్‌రెడ్డి, తలారి రాములు, ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

శబరిమల మహా పాదయాత్ర పోస్టర్‌ ఆవిష్కరణ

నానక్‌రాంగూడలో అక్టోబర్‌ 15న ప్రారంభం



పోస్టర్‌ను ఆవిష్కరించిన నిర్వాహకులు

రాయదుర్గం: దివ్యజ్యోతి ఆడియోస్‌ సంస్థ ఆధ్వర్యంలో శబరిమల మహాపాదయాత్రను అక్టోబర్‌ 15 నుంచి నిర్వహించాలని నిర్ణయించారు. ఈ మేరకు మహాపాదయాత్ర పోస్టర్‌ ఆవిష్కరణను నానక్‌రాంగూడలోని పోచమ్మ దేవాలయం ప్రాంగణంలో సీనియర్‌ నాయకులు డి నరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ముత్యంరెడ్డి మాట్లాడుతూ ఏడు సంవత్సరాలుగా నానక్‌రాంగూడ నుంచి శబరిమలకు ఉచితంగా 100 మంది అయ్యప్ప భక్తులను మహాపాదయాత్రకు తీసుకెళ్ళడం జరుగుతుందన్నారు. అక్టోబర్‌ 15వ తేదీన నానక్‌రాంగూడలోని రంగనాథస్వామి ఆలయంలో ఉదయం 7 గంటలకు ప్రారంభమవుతుందని 38 రోజులపాటు 1,400 కిలోమీటర్లు సాగుతుందన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌, కర్నాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రాల మీదుగా యాత్ర నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో స్థానిక ప్రతినిధులు తుకారామ్‌, హరీష్‌రెడ్డి, పాండు, చిన్న, కృష్ణారెడ్డి, మాధవరెడ్డి, జగన్‌ మోహన్‌రెడ్డి, నర్సింహారెడ్డి, శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి.. 14 ఫిర్యాదులు



ప్రజావాణిలో అధికారులకు సమస్యలు తెలియజేస్తున్న ప్రజలు



శేరిలింగంపల్లి సర్కిల్‌ కార్యాలయంలో..

చందానగర్‌: చందానగర్‌ సర్కిల్‌- 21 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 7 ఫిర్యాదులు వచ్చాయని ఉపకమిషనర్‌ శశిరేఖ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టౌన్‌ ప్లానింగ్‌ 4, శానిటేషన్‌ 1, రెవెన్యూ 1, ఇంజనీరింగ్‌ 1 ఫిర్యాదు వచ్చాయని, ఆ ఫిర్యాదులను సంబంధిత అధికారులకు సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏఎంసీ మణికరణ్‌, ఏసీపీ నాగిరెడ్డి, ఇంజనీరింగ్‌ డీఈ దుర్గాప్రసాద్‌, ఏఎంహెచ్‌ఓ డాక్టర్‌ రవికుమార్‌, శానిటేషన్‌ సూపర్‌వైజర్‌ శ్రీనివాస్‌, యూబీడీ అధికారులు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

శేరిలింగంపల్లి సర్కిల్‌లో..

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి సర్కిల్‌లో ఇంచార్జ్‌ డిప్యూటీ కమిషనర్‌ శశిరేఖ అధ్యక్షతన జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో ఏడు ఫిర్యాదులు అందజేశారు. టౌన్‌ప్లానింగ్‌ 5, ఇంజనీరింగ్‌, ఎలక్ట్రికల్‌ విభాగాలకు ఒక్కొక్కటిగా వచ్చినట్లు అధికారులు వివరించారు. కార్యక్రమంలో ఏఎంసీలు శ్రవణ్‌ కుమార్‌రెడ్డి, ప్రేమ్‌కుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పోచమ్మ ఆలయ వార్షికోత్సవం



పూజల్లో పాల్గొన్న భక్తులు

రాయదుర్గం: నానక్‌రాంగూడలో పోచమ్మ అమ్మవారి ఆలయ వార్షికోత్సవాన్ని సోమవారం వైభవంగా నిర్వహించారు. ఆలయాన్ని పూలు, మామిడిఆకులు, విద్యుత్‌ దీపాలతో అలంకరించారు. అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేకంగా గాజులతో అలంకారం చేసి భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు.

పాపిరెడ్డినగర్‌ కాలనీలో..

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి డివిజన్‌ పరిధిలోని పాపిరెడ్డినగర్‌ కాలనీలోని శ్రీ ఓంకారేశ్వర శివాలయం, భక్త మార్కండేయ దేవాలయం వార్షిక మహోత్సవ కార్యక్రమంలో సోమవారం పీఏసీ చైర్మన్‌, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ హాజరై ప్రత్యేక పూజలు చేశారు.ఈ కార్యక్రమంలో నాయకులు ఎర్రగుడ్ల శ్రీనివాస్‌ యాదవ్‌, చంద్రారెడ్డి, ప్రభాకర్‌ పద్మశాలి, శ్రీకాంత్‌ తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో పాల్గొనాలి

రాయదుర్గం: ప్రతి యేటా హానర్‌ వివాంటీస్‌ స్పోర్ట్స్‌ కార్నివాల్‌లో ప్రతి ఇంటి నుంచి ఒక్కరైనా పాల్గొనేలా చూడాలని వివాంటీస్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ నిర్ణయించింది. గోపన్‌పల్లిలోని హానర్‌ అపార్ట్‌మెంట్స్‌లో సోమవారం అధ్యక్షుడు ప్రకాశ్‌ ఆధ్వర్యంలో అసోసియేషన్‌ సమావేశం నిర్వహించింది.. ఈ క్రీడోత్సవాలను భవిష్యత్తులో మరింత భారీగా నిర్వహించాలని సంకల్పించినట్లు సభ్యులు తీర్మానించారు. కార్యక్రమంలో అసోసియేషన్‌ ఉపాధ్యక్షుడు కిషోర్‌వర్మ, సంయుక్త కార్యదర్శి వెంకటకృష్ణ అంబటి, కోశాధికారి రాహుల్‌, జాయింట్‌ ట్రెజరర్‌ సుమిత్‌, కార్యవర్గసభ్యులు ఈషా, పరుల్‌, శ్రీనివాస్‌ బాల, సుబ్బారావు, ప్రసాద్‌, భాస్కర్‌ అపార్ట్‌మెంట్‌వాసులు పాల్గొన్నారు.

కార్పొరేటర్‌ను కలిసిన నూతన కార్యవర్గం



ఆల్విన్‌కాలనీ: శేరిలింగంపల్లి నియోజకవర్గం వివేకానందనగర్‌ డివిజన్‌లోని వెంకటేశ్వరనగర్‌ 35వ బ్లాక్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ నూతన కార్యవర్గం సోమవారం వివేకానందనగర్‌ డివిజన్‌ కార్పొరేటర్‌ మాధవరం రోజాదేవిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమె సభ్యులకు అభినందనలు తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ స్థానిక సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో రాములు సాగర్‌, రామ్‌సాగర్‌, నర్సింగ్‌రావు, సత్యనారాయణ, అధ్యక్షులు ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్‌, కోశాధికారి అనిల్‌, సొసైటీ మెంబర్లు పాల్గొన్నారు.

నేటి నుంచి స్పెషల్‌ డ్రైవ్‌!

- కరెంటు స్తంభాల నుంచి కేబుల్‌ వైర్లు తొలగింపు
- ఈనెల 26 లోపు పూర్తి చేయాలని ఆదేశం
- బంజారాహిల్స్‌ డివిజన్‌ పరిధిలో ప్రత్యేక బృందాలు



కరెంటు స్తంభానికి చుట్టుకున్న కేబుల్‌ వైర్ల కట్టలు

బంజారాహిల్స్‌: రామంతాపూర్‌ ఘటన నేపథ్యంలో బంజారాహిల్స్‌ పరిధిలో నేటి నుంచి స్పెషల్‌ డ్రైవ్‌ చేపట్టారు. టీజీఎస్‌పీడీసీఎల్‌ బంజారాహిల్స్‌ డివిజన్‌ కిందికి వచ్చే 24 సబ్‌స్టేషన్ల పరిధిలో కరెంటు స్తంభాలకు ఉన్న కేబుల్‌ వైర్లు, ఇంటర్నెట్‌ వైర్లను తొలగించాలని నిర్ణయించారు. ఈ మేరకు సోమవారం అన్ని సబ్‌స్టేషన్ల ఏడీఈలు, ఏఈలు, లైన్‌మెన్లతో సమావేశమైన అధికారులు తగిన ఆదేశాలు జారీ చేశారు. కాగా రామంతాపూర్‌లోని గోకుల్‌నగర్‌లో ఆదివారం అర్ధరాత్రి శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా నిర్వహించిన ఊరేగింపు రథానికి విద్యుత్‌ తీగలు తగిలి ఆరుగురు మృతి చెందిన ఘటన విదితమే. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులు ముందస్తు చర్యలకు శ్రీకారం చుట్టారు.

- టీజీఎస్‌పీడీసీఎల్‌ బంజారాహిల్స్‌ డివిజనల్‌ పరిధిలోకి ఫిలింనగర్‌, జూబ్లీహిల్స్‌, బంజారాహిల్స్‌, అయ్యప్పసొసైటీ, బోరబండ, కళ్యాణ్‌నగర్‌, శ్రీకృష్ణానగర్‌, ఎల్వీప్రసాద్‌, మాదాపూర్‌, మైత్రీవనం, ఎమ్మెల్యేకాలనీ, నిమ్స్‌, ప్రశాసన్‌నగర్‌, రహేజా, రవీందర్‌నగర్‌, బంజారాహిల్స్‌ రోడ్డునెంబర్‌-2, రోడ్డునెంబర్‌-12, రోడ్డునెంబర్‌-13, జూబ్లీహిల్స్‌ రోడ్డునెంబర్‌-22, శ్రీనగర్‌కాలనీ, టోలిచౌకి, ఎల్లారెడ్డిగూడ, యూసుఫ్‌గూడ తదితర 24 సబ్‌స్టేషన్లు వస్తాయి.
- ఈ సబ్‌స్టేషన్ల పరిధిలో 195 ఫీడర్లు ఉండగా, 7,250 ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయి. 1,83,000 మంది వినియోగదారులు ఉన్నారు.
- వీటి పరిధిలో 15,299 స్తంభాలు ఉండగా, వీటికి స్టార్‌ కేబుల్‌ వైర్లు, ఇంటర్నెట్‌ కేబుల్స్‌ తగిలించి ఉన్నట్లుగా గుర్తించారు.
- 584 కిలోమీటర్ల మేర కరెంటు వైర్లు విస్తరించి ఉన్నాయి. ఈ నెల 19 నుంచి 26వ తేదీ వరకు అన్ని కరెంటు స్తంభాలకు తగిలించి ఉన్న కేబుల్‌ వైర్లను తొలగించాలని ఆదేశించారు.
- మంగళవారం ఉదయం 8 గంటల నుంచి అన్ని సబ్‌స్టేషన్ల పరిధిలో ఈ స్పెషల్‌ డ్రైవ్‌ కొనసాగనున్నది.
- తొలగించిన తర్వాత కేబుల్‌ వైర్లను కుప్పగా వేసి ఫొటోలు తీసి ఉన్నతాధికారులకు పంపించాల్సి ఉంటుంది.
- రామంతాపూర్‌ ఘటన నేపథ్యంలో బంజారాహిల్స్‌ పరిధిలో క్రిందిస్థాయి ఉద్యోగి నుంచి ఉన్నతాధికారుల వరకు అందరూ ఈ స్పెషల్‌ డ్రైవ్‌లో పాల్గొనాలని సూచించారు.
- ప్రతి కరెంటు స్తంభాన్ని క్షుణ్ణంగా పరిశీలించి ఒక్క కేబుల్‌ వైర్‌ కూడా లేకుండా తొలగించాలని కఠినమైన ఆదేశాలు జారీ చేశారు.
- భవిష్యత్‌లో ఇలాంటి సంఘటనలు జరగకుండా ఉండాలంటే ఇప్పటినుంచే చర్యలు ప్రారంభించామని అధికారులు పేర్కొంటున్నారు.

26లోపు మొత్తం కేబుల్‌ వైర్ల తొలగింపు

మా పరిధిలో ఉన్న 24 సబ్‌స్టేషన్ల పరిధిలో కరెంటు స్తంభాలకు చుట్టి ఉన్న కేబుల్‌ వైర్లను తొలగించాలని ఆదేశించాం. ఈ మేరకు ఏఈలు, ఇతర సిబ్బంది కలిపి 134 మంది మంగళవారం ఉదయం 8 గంటల నుంచి డ్రైవ్‌లో పాల్గొంటారు. మేము కూడా అన్ని ప్రాంతాలను పరిశీలిస్తాం. ఈనెల 26 లోపు మొత్తం కేబుల్‌ వైర్లను తొలగించాలని ఖచ్చితమైన ఆదేశాలు జారీ చేశాం. రామంతాపూర్‌ ఘటన దురదృష్టకరం. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే చర్యలు తీసుకోకతప్పదు. అందుకే ఈ విషయంలో పట్టుదలగా ఉన్నాం. ప్రజలు కూడా సహకరించాలి.

– పి.హనుమంతరెడ్డి, టీజీఎస్‌పీడీసీఎల్‌ డీఈ, బంజారాహిల్స్‌